
# పెద్దల సబ్బాతుబడి పాఠములు
# యెహోషువ గ్రంథము
# విశ్వాస పాఠములు

## నాల్గవ త్రిమాసం-2025



**అక్టోబరు, నవంబరు, డిశంబరు - 2025**


గ్రంథకర్త

**బర్నా మగయరోశి**

అనువాదం

**చింతా ప్రకాష్**

8వ పాఠం

నవంబరు 15-21

# విశ్వాసవీరులు : యెహోషువ మరియు కాలేబు

## సబ్బాతు మధ్యాహ్నము

నవంబరు 15

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : సంఖ్యా 13:6; 30-32; యెహోషువ 14:6-14; లూకా 18:1-5; యెహోషువ 19:49-51; 2కొరింథి 3:18; రోమా 12:1,2.**

**కంఠతవచనం : "మీకు దేవుని వాక్యము బోధించి, మీపైని నాయకులుగా ఉన్న వారిని జ్ఞాపకము చేసుకొని, వారి ప్రవర్తన ఫలమును, శ్రద్ధగా తలంచుకొనుచు వారి విశ్వాసమును అనుసరించుడి' (హెబ్రీ 13:7).**

ఒకని చూచి, అటువలె నడచుకొనవలెనని వారి పిల్లలు నేర్చుకుంటారని ప్రతి తల్లి లేక తండ్రికి తెలుసు. అవును కదా! తల్లిదండ్రులకున్న మంచి లక్షణాలకు బదులు, వారికున్న చెడు లక్షణాలు చూచి వారి పిల్లలు చెడిపోయారని, ఎంతో మంది తల్లిదండ్రులు ఆందోళన చెందుట లేదా? మన వయస్సు ఏదైనప్పటికి, న్యాయమైన దానిని చేయుటకన్నా, తప్పును చేయుట చాలా సులభమైన పనిగా కనిపిస్తున్నది. పతనమైన మానవజాతిలో అది ఒక భాగమును కలుగజేయుచున్నది. "ఏలయనగా నేను చేయునది నేనెరుగను. నేను చేయ నిచ్చయించునది చేయక ద్వేషించునదియే చేయుచున్నాను" (రోమా 7:15) దీనితో సంబంధము లేనిదెవరు?

మానవులకు పుట్టిన నాటి నుండి, మాదిరికున్న శక్తి ద్వారా ప్రవర్తన ఏర్పడుతుంది. మనకు అతి సమీపముగా ఉన్న వారిని అనుకరించుట ద్వారా అనగా నడుచుట, మాట్లాడుట, మన భావావేశములను వ్యక్తపరచుట లేక తెలియజేయుట వంటి సామాన్యమైన ప్రాథమిక జీవిత విషయాలను నేర్చుకుంటాము. పెద్ద వారమైన తరువాత కూడా మనకు ఆదర్శ వ్యక్తులయొక్క అవసరముంది. ఆదర్శ వ్యక్తులు పరిపూర్ణులు కాకపోవచ్చును గాని వారిలో ఉన్న ఆధ్యాత్మిక లక్షణాలు వారిని విశ్వాసవీరులుగా చేసిన యెడల అటువంటి వారిని మనము ప్రశంసించవచ్చును. మనకు మాదిరిగా వారిని అనుసరించవచ్చును.

యెహోషువ గ్రంథములో పేర్కొనబడిన ఇద్దరు విశ్వాసవీరులైన కాలేబు మరియు యెహోషువలను గూర్చి ఈవారము మనము లోతుగా అధ్యయనము చేయబోవుచున్నాము. వారి తరములో వారిరువురు మిగిలిన వారికన్నా ఎందువలన విశ్వాసవీరులుగా ఎంచబడినారు? ఇశ్రాయేలీయుల చరిత్రలో చాలా ప్రాముఖ్యమైన సమయమందు దేవుని ప్రజలయొక్క జీవితములో ఏవిధముగా ప్రాముఖ్యమైన పాత్రను పోషించగలిగారు?

– నవంబరు 22, సబ్బాతు దినమున, ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతు బడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **నవంబరు 16**

## విశ్వాస్యత

**సంఖ్యా 13:6, 30-32 మరియు యెహోషువ 14:6,14 చదువుడి. కాలేబు ఎవరు? ఇశ్రాయేలు జనాంగములో ఆయన స్థానము ఏమిటి?**

కాలేబు అనే పేరు హెబ్రీ పదమైన కేలెబ్ డాగ్ 'కుక్క' అనే ఒక వ్యతిరేకభావము కలిగిన ప్రతి సందర్భములో వాడబడినట్లు పాతనిబంధనలో కనిపిస్తున్నది. అయితే 'కాలేబ్' అనే పదమును అదనపు బైబిలు పత్రికలు మరియు కీర్తనలలో తన యజమానునికి అతడు లేక ఆమె విశ్వాస్యతతో స్నేహపూర్వకమైన పట్టుదలతో ధైర్యముగా సేవ చేసుకొనే ఒక దాసుని, దాసురాలిని ఆ పదము సూచిస్తుంది. ఈ విధమైన రెండవ భావముతో చూచినపుడు పై వాక్యములలో పేర్కొనబడిన కాలేబు 'తన పేరుకు తగినట్లుగా విశ్వాస్యతతో తన జీవిత కాలమంతయు దేవుడైన యెహోవా యెడల దృఢమైన రాజభక్తిని ప్రదర్శించాడు'.

**కనాను దేశమును సంచరించి చూచుటకు పంపబడిన వేగుల వారిలో సగముకంటె ఎక్కువమంది పూర్తిగా విరుద్ధమైన అభిప్రాయమును తెలియపర్చిన తరువాత, అతడిని చంపేస్తామని ఇశ్రాయేలీయులు భయపెట్టిన తరువాత కూడా, కాలేబు మాత్రము తన మనస్సులోని మాటను తెలియపర్చినందుకు అతని గూర్చి ఏమి చెప్పబడెను? సంఖ్యా 14:6-10, 21-25; సంఖ్యా 26:65; సంఖ్యా 32:12.**

యెహోషువ మరియు కాలేబు యొక్క సమకాలిక ప్రముఖ ఇశ్రాయేలు నాయకులను పరిశీలించండి. షమ్మూయ, షాపాతు, ఇగాలు, పల్తీ, గదీయేలు గదీ ; అమ్మియేలు సెమారు; సహోబీ; నవి; గమనించండి, ఇవి బాగా పరిచయమైన పేర్లేనా? బహుష కాకపోవచ్చు.

ఎందువలన? కానాను దేశములో సంచరించి విషయాలను సేకరించాలని పంపించబడిన 12 మందిలో ఈ పదిమంది పేర్లు గల వారు కూడా ఉన్నారు. అయితే ఆ 12 మందిలో ఈ 10 మంది పేర్లు మరచిపోవుటకు వారి యొక్క అయోగ్యతే కారణము. వాగ్దాన భూమిని జయించుట అసాధ్యమైన పని అని వారు నివేదిక ఇచ్చారు. వారిని వారు మిడతలకు పోల్చుకున్నారు. కానాను దేశములో అప్పటికే నివాసముంటున్న ప్రజలు ఇశ్రాయేలీయులకంటే బలవంతులు, వారిని ఓడించడము అసాధ్యము, వారిని చూస్తే మా గుండెల్లో వణుకు పుట్టినది. వారి పట్టణములు జయించుటకు వీలుగాని ప్రాకారములు గలవి అని చెప్పిరి.

అయితే అనుకూలమైన నివేదికనిచ్చిన వేగుల వారిలో పెద్దవాడైన కాలేబు ముందుగా మాట్లాడెను. కానాను దేశమును స్వాధీనపరచుకొనడం సాధ్యమైన విషయమే అనే నివేదిక ఇచ్చెను. అతనిలో చాలా ప్రోత్సాహకరమైన విశ్వాస వైఖరి ఉన్నది. అతడు మాట్లాడబోయేది సత్యమని తెలుసుకున్న కాలేబు మాట్లాడుటకు ఏవిధముగాను సంకోచించలేదు. ఇశ్రాయేలీయులు మూకుమ్మడిగా వారి మీద దాడి చేసి చంపివేస్తారు అని బెదిరించినను అతడు సత్యమును మాట్లాడుటకు భయపడలేదు. "ప్రత్యక్షపు గుడారములో యెహోవా మహిమ ఇశ్రాయేలీయులందరికి కనబడెను" (సంఖ్యా 14:10).

**మీ చుట్టూ ఉన్న వారిలో ఎక్కువ మంది మీకు వ్యతిరేకమైన అభిప్రాయమును కలిగియున్నపుడు, ఆ అభిప్రాయములో నీవు ఏకీభవించనపుడు నీవేమి చేస్తావు?**

సోమవారం నవంబరు 17

## ఈ కొండ ప్రాంతమును నాకు దయచేయుము

**యెహోషువ 14:6-14; సంఖ్యా 14:24; 32:12; ద్వితియో 1:36; లూకా 6:45 చదువుడి. కాలేబు, యెహోషువ చూపిన వైఖరిని మీరు ఎట్లు వర్ణింతురు? పరిపూర్ణముగా దేవుని వెంబడించుట అనగా అర్ధమేమిటి?**

..........................................................................................

దేవుడు మోషే ద్వారా ఇచ్చిన వాగ్దానము గూర్చి కాలేబు ఎన్నడూ మరువలేదు. "నా సేవకుడైన కాలేబు మంచి మనస్సు కలిగి పూర్ణ మనసుతో నన్ను అనుసరించిన హేతువు చేత అతడు పోయిన దేశములో అతని ప్రవేశ పెట్టెదను" (సంఖ్యా 14:24) 40 సంవత్సరాల తరువాత అదే దేశమును గూర్చి "తన హృదయములోని మాటను తన నివేదికగా సమర్పించెను. (యెహోషువ 14:7) దేవుని నడుపుదల, సహాయముతో ఇశ్రాయేలు ప్రజలు ఆ దేశమును జయించి స్వాధీనపరచుకొని అందులో జీవించగలరని తనకు కలిగిన దృఢ విశ్వాసముతో తన నివేదికను ఆధారము చేసుకొని చెప్పెను.

మిగిలిన పదిమంది వేగులవారు ఇశ్రాయేలీయులలో భయమును పుట్టించి ఇచ్చిన నివేదికకు విరుద్ధముగా దేవుని వాగ్దానము మీదున్న హృదయపూర్వక నమ్మకము, దృఢ విశ్వాసమును ప్రదర్శిస్తూ కాలేబు తన నివేదికను సమర్పించెను. హీబ్రూ భాషలో కాలేబు వ్యక్తపరచిన మాటల యొక్క అక్షరార్ధమైన భావము ఈవిధముగా ఉన్నది. "నేను నా దేవుడైన యెహోవాను నిండు మనస్సుతో అనుసరించితిని" (యెహోషువ 14:8). ఈ మాటలు విశాలమైన భావమును క్లుప్తముగా వివరించినట్లున్నది. "నా హృదయము పరిపూర్ణముగా దేవునిని వెంబడించుటకు సిద్దపడియున్నది" ఇది కాలేబులో ఉన్న భావము. ఇతర వేగులవారు ఇశ్రాయేలు నాయకులు, ఇతర దేవతల వెంబడి నడిచి, ఆ విగ్రహములకు పూజించి దేవునిని పరిపూర్ణముగా అనుసరించని స్థితిలో ఉండగా, కాలేబు యొక్క హృదయము దేవునికి సంపూర్ణముగా సమర్పించుకొనెను.

ఇదే భావమును వేరే రెండు సందర్భాలలో కాలేబు నొక్కి పలుకుతూ తన విశ్వాసమును ప్రకటించెను (యెహో 14:9,14) దేవుడు తనను గూర్చి మాట్లాడిన "ఒక మంచి మనస్సు కలిగిన కాలేబు" (సంఖ్యా 14:24) అనే మాటకు కాలేబు చూపిన ప్రవర్తనకు ఈ రెండింటి మధ్య ఉన్న సామరస్యము వలననే మిగిలిన 10 మంది వేగుల వారికన్నా కాలేబు భిన్నముగా కనబడుటయే గాక, మంచి గుర్తింపును పొందెను. అప్పటికి అతని వయస్సు 85 సం॥లు. అయినా దేవుడు తన ప్రజల ద్వారా ఏమి సాధ్యపరచాలనుకున్నాడో దానికి మాదిరిగా దేవుని కార్యమును సఫలము చేయుటకు పరిపూర్ణముగా సమర్పించుకున్న హృదయము గల వానిగా అందరికన్నా చాలా ఎత్తులో నిలువబడగలిగాడు.

దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు వాగ్దానము చేసిన దేశమును, ఆయన మీదున్న విశ్వాసముతో ఎంతవరకు శత్రువులను తొక్కుకుంటూ వెళ్ళి ఆక్రమించుకొనకగలరో అంత మట్టుకు వారి సొంతమవుతుందనే అవగాహన కాలేబుకున్నది. దేవుని వాగ్దానాలు వాటంతటవి నెరవేరినవి కావు, అనగా మన చిత్తము లేకపోయినను అవి నెరవేరుననునది నిజము కాదు గాని, విశ్వాసముతో కూడిన దృఢ సంకల్పముతో పాటు, ధైర్యముగా క్రియారూపములో వాటిని

పొందుకొనవలసియున్నది. ఇక్కడ వాడబడిన హీబ్రూ పదము 'యులే' సాధ్యమగును లేక సాధ్యము కాకపోవచ్చు అనే మాట భయమును లేక అనుమానమును కల్గించే మాటగా కనిపిస్తున్నా, అదొక అనుకూలమైన మాటగా నిరీక్షణ, జరుగుతుందనే ఆశ అందులో ఉంది. యెహోషువ 14:12; ఆది 16:2; సంఖ్యా 22:6, 11; 23:3 చూడుడి.

**దేవునిని పరిపూర్ణముగా వెంబడించకుండా చేసే "చిన్నచిన్న రాజీపడిపోయే విషయాలు ఏమిటి?"**

## మంగళవారం నవంబరు 18

## మాదిరికున్న బలము

**యెహోషువ 15:16-19; న్యాయాధి 1:13; 3:7-11 చదువుడి. మాదిరికున్న బలమును గూర్చి ఈ వృత్తాంతము మనకేమి బోధిస్తుంది? కాలేబు యొక్క వైఖరి యువతరముపై ఎటువంటి ప్రభావము చూపించింది?**

..........................................................................................

దెబీరు ప్రాంతములో ఉన్న ప్రజల మీదికి యుద్ధమునకు వెళ్ళివాళ్ళను జయించు వానికి తన కుమార్తె అయిన అక్సాను నిచ్చి వివాహము చేస్తానని కాలేబు ప్రకటించెను. ఈ వృత్తాంతమునకు కొంత ప్రాధాన్యత ఉన్నది. అది కాలేబు యొక్క ధైర్యమును, విశ్వాసమును మరియు సవాళ్ళను ఎదుర్కొనుటకు అతని యొక్క సంసిద్ధత ఇందులో కనిపించుచున్నది. కాలేబు ఇచ్చిన సవాలును తీసుకున్న ఒత్నీయేలు దెబీరు పట్టణమును జయించి అక్సాను వివాహమాడెను.

ఆవిధముగా విశ్వాసవీరులైన కాలేబు మరియు యెహోషువాలను ఇశ్రాయేలీయులలోని తరువాత తరము వారు మాదిరిగా తీసుకొని వారి అడుగుజాడలలో నడిచిరి. పాత తరము ఇశ్రాయేలు ప్రజలు వారి పరిచర్యను ముగించుచుండగా భవిష్యత్తులోను అప్పటికప్పుడు ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనుటకు ఒక నూతన తరమునకు చెందిన ఇశ్రాయేలు జనాంగము సిద్ధముగా ఉన్నది. ఇశ్రాయేలీయుల కొరకు దేవునికున్న ప్రణాళికను నెరవేరునట్లు ముందుకు సాగిరి.

యెహోషువాను కాలేబు 'ఈ కొండ దేశమును నాకు ఇమ్ము' అని అడిగినట్లుగ, అక్సాను తన భర్త యొక్క ప్రోత్సాహముతో, ఆమె తండ్రి చూపించిన విశ్వాసమును మరియు సంకల్పమును అనుకరించెను. అక్సాను కూడా ఆమె తండ్రి చూపించిన విశ్వాసమును కాలేబు మాదిరిని తీసుకొని దేవుని వాగ్దానము ప్రకారము ఆ వాగ్దాన భూమిలోని తన వంతు భూమిని తీసుకొనుట ద్వారా దేవుని వాగ్దానము నెరవేరుటకు దోహదపడెను.

నిజానికి ఆ దేశము యావెహ్, యెహోవా దేవుని నుండి ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేయబడినది. విశ్వాసముతోను, ధైర్యముతోను దేవుని వాగ్దానమును హక్కుగా పొందుటకు ఇశ్రాయేలీయులు చిత్తశుద్ధితో వారి వంతు పోరాటములు చేయుచుండవలెను. యేసు ఈ లోకములో పరిచర్య చేసిన కాలములోను వార్తలలో పేర్కొనబడిన స్త్రీలు వారిని శిష్యులు లేక జన సమూహములో ఉన్న అధికారులు వెలుపలకు నెట్టి వేయుచున్నను, ఆ స్త్రీలు వారి పోరాటములు కొనసాగిస్తూ, యేసు యొక్క దీవెనలు వారి కొరకు, కుటుంబముల కొరకు సంపాదించే విషయములో వాటిని పొందేవరకు చూపించిన పట్టుదల వంటి పట్టుదలను అక్సాను ముందుగానే అడిగి పొందుకొని యుండెను.

**లూకా 18:1-5 చదువుడి. ఈ వాక్యాలనుండి వచ్చుచున్న గుణపాఠము ఏమిటి?**

మనకు దేవుడు అప్పగించిన పనిని నెరవేర్చుటకు విశ్వాసపు దివిటీని తరువాత తరము వారికి అందించుట చాలా ప్రాముఖ్యమైన విషయము. ఒక ప్రక్క మనము ఎదుర్కొనుచున్న సవాళ్ళను తరువాత తరము వారికి అందించుట ద్వారా దేవుని పనిని చేయుటకు వారికి బాధ్యత అప్పగించినట్లవుతుంది. దేవునికి సంబంధించిన నాయకత్వమును యువతరము వారికి తర్ఫీదు నిచ్చి అప్పగించే విషయములో మనము ఎటువంటి సదుపాయములను మనము వారికి కల్పించుచున్నాము? ఈ విషయములో మన మాదిరి ఎందువలన అంత ప్రాముఖ్యమైనది?

**బుధవారం** **నవంబరు 19**

## వినయము గల వీరుడు

ఇశ్రాయేలీయుల వివిధ గోత్రములకు పంచిపెట్టబడిన భూమికున్న పేర్లు అనేకము. ఆ భూములకున్న సరిహద్దులు కూడా వివరముగా తెలియపర్చడముతో ఆ గ్రంథము ముగిసింది. వివిధ గోత్రములకు చేసిన భూపంపకాలు కాలేబు, యెహోషువలు పర్యవేక్షించారు. అందరితోపాటు ఇరువురు వీరులు కూడా వారి వారసత్వమును స్వీకరించారు. కాలేబు తన వారసత్వమును ముందుగా స్వీకరించాడు. చివరిగా యెహోషువ తన వారసత్వమును స్వీకరించాడు. ఇప్పటివరకు యెహోషువ, ఇశ్రాయేలు గోత్రములందరికి భూమిని కేటాయించాడు. చివరికి ఇశ్రాయేలు ప్రజలందరు కలిసి యెహోషువకు, తన స్వాస్థ్యమును అప్పగించవలసిన సమయము వచ్చెను.

**యెహోషువ 19:49-51 చదువుడి. ఇశ్రాయేలీయులకు గొప్ప నాయకుడు తనకు స్వాస్థ్యముగా రావలసిన భూమిని అందరికన్నా చివరిగా పొందుటలో ఉన్న అంతర్భావము ఏమిటి?**

యెహోషువ తనకు స్వాస్థ్యముగా పొందిన పట్టణము పేరు “తిమ్న త్సెరహు” ఆ పట్టణము యొక్క పేరులో రెండు పదాల కలయిక ఉన్నది. మొదటి మాట ‘తిమ్న’ అది ఒక క్రియాపదమైన ‘మనహ్’ నుండి వచ్చినది. ‘లెక్కించుట లేక అప్పగించుట’ ‘భూభాగము’ అనే అర్థము కూడా ఉన్నది. రెండవ మాట ఒక హెబ్రీ క్రియాపదమైన ‘సిరాన్’ అనగా మిగిలిపోయిన లేక అధికముగా ఉన్న అనే భావమును ఆ పదము సూచిస్తుంది. (నిర్గమ 26:12తో పోల్చి చూడుడి). యెహోషువకు స్వాస్థ్యముగా వచ్చిన పట్టణమును “మిగిలిపోయిన భాగము” అని తర్జుమా చేసిరి.

ఇశ్రాయేలు గోత్రముల వారికి వారివారి లెక్కల ప్రకారము ప్రత్యక్ష గుడారమునొద్ద యెహోవా సన్నిధిని చీట్ల వలన పంపకములు చేసిన తరువాత మిగిలిపోయిన పట్టణమును ఇశ్రాయేలీయుల యొక్క రెండవ నాయకుడు తన స్వాస్థ్యముగా ఎన్నుకొనుట ద్వారా యెహోషువ తన గొప్ప స్వభావమును చాటుకున్నాడు. ముందుగా అతడు, మిగిలిన గోత్రముల వారందరు వారికి రావలసిన స్వాస్థ్యము పొందువరకు, తనకు రావలసిన స్వాస్థ్యము కొరకు వేచియున్నాడు. యెహోషువ ఎక్కువ జనాభా కలిగిన అందరికి నచ్చే పట్టణమును అతడు తనకు నచ్చే స్వాస్థ్యముగా ఎంచుకొనలేదు గాని నిరాడంబరమైన శిథిలమైన పట్టణమును ఎన్నుకొనెను. బహుశ తనే

కష్టపడి, తనకిష్టమైన రీతిలో ఆ పట్టణమును పున: నిర్మాణము చేసుకొనవచ్చుననే ఉద్దేశము అతనికి ఉండియుండవచ్చు. (యెహోషువ 19:50తో పోల్చిచూడుడి)

ఇంకా ఆలోచించినట్లయితే ఆయన స్వాస్థ్యముగా ఎంచుకొనిన తిమ్నాత్సెరహు పట్టణము షిలోహులో నున్న మందిరమునకు సమీపముగా నున్న ప్రత్యక్ష గుడారమునకు చేరువుగా ఉన్నది. దాని ప్రకారము యెహోషువ ఒక నాయకుడుగా, తన బాధ్యతలను నిర్వహించుటకు అనువైన స్థలముగా దానిని ఎంచుకొనుట ద్వారా తన హృదయము ప్రజల యొక్క సమస్యలకు సమీపముగా ఉందని కనిపిస్తుంది. నిజముగానే క్రొత్తగా జన్మించిన ఇశ్రాయేలు దేశము దేవుని సహాయముతో దేవుడే వాగ్దానము చేసిన దేశమును ప్రతి గోత్రమునకు, తెగకును, కుటుంబములకు స్వాస్థ్యముగా సంపాదించి పెట్టుటే తన లక్ష్యమైనందున తనకు అందరికన్నా మంచి పట్టణమును కోరుకొనుట భావ్యమనిపించలేదు. అయినప్పటికి యెహోషువ ఒక సామాన్యమైన జీవితమును జీవించుటకు తన దృష్టిని పెట్టెను. తరువాత కాలములో దావీదు ప్రార్థించినట్లు యెహోషువా జీవితము ఒక సాక్ష్యముగా నిలిచెను. "యెహోవా యొద్ద ఒక వరము అడిగితిని. దానిని నేను వెదకుచున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును, ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవితకాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను" (కీర్తన 27:4)

**యెహోషువా చూపిన వైఖరి ద్వారా నీ జీవితంలో ఎట్టి పాఠములను నేర్చుకున్నావు? అతని వైఖరిని ఎట్లు నీ జీవితానికి అన్వయించుకొనగలవు?**

## గురువారం నవంబరు 20

## ధ్యానించుట ద్వారా మార్చబడెను

**గొప్ప విశ్వాసవీరుల యొక్క మాదిరికరమైన జీవితాలను గూర్చి ధ్యానించుటవలన అది మన ఆధ్యాత్మిక జీవితము యొక్క ఎదుగుదలకు దోహదపడుతుంది. అయితే మనకు ప్రధానముగా క్రీస్తే మన మాదిరి. ఆయన జీవితము, ఆయన బోధలు మనకు ఆదర్శము. యేసు జీవితముపై దృష్టి పెడితే మన జీవితాలను అదెట్లు మార్పు చేయగలదు? (హెబ్రీ 12:1,2; 2కొరింథి 3:18) చూడుడి.**

లాస్ ఏంజిల్స్, కాలిఫోర్నియా విశ్వ విద్యాలయములో, ఒక నాడీ శాస్త్ర నిపుణుడైన మార్కో ఇకొబోన "దర్పణ నాడీ కణముల" యొక్క విధులను గూర్చి పరిశోధనలు చేసెను. కొన్ని పనులను చేసినపుడు ఈ సూక్ష్మ కణములలో విద్యుద్వలయములు ఏర్పడతాయి. ఉదాహరణకు, మన చిరునవ్వును చూపించుట లేక ఎవరినైనా హత్తుకొనుట వంటి చర్యలను చేస్తాము. ఇతరులు చేస్తుంటే చూస్తాము, ఈ నాడీ కణములు "చూచుట, చేయుట" వంటి చర్యల మధ్య ఉన్న తేడాను తగ్గించి వేయుట వలన ఆ రెండు పనులు ఏక కాలములో సంభవించవచ్చును.

యేసు యొక్క స్వభావమును గమనించవలసిన అవసరమును గూర్చి ఎలెన్ జి వైట్ మాట్లాడారు. "యేసువైపు మనము చూచుట ద్వారా, దేవుని గూర్చిన వెలుగు సంబంధమైన ఆయన ప్రత్యేక లక్షణములను గూర్చి తెలుసుకొనగలము".

దేవునిని గమనించుట ద్వారా మార్పు చెందుదుము. తోటి మానవుల యెడల

మంచితనము, ప్రేమను చూపుట మనకు స్వాభావికమైన లక్షణముగా ఏర్పడును. ఆయనను గమనించుట ద్వారా మనలో దైవ సంబంధమైన స్వభావము అభివృద్ధి చెందును. ఆయన స్వరూపములోనికి ఎదుగుదుము. దేవుని గూర్చి తెలుసుకొనగలిగే సామర్థ్యము మనలో అధికమగును. పరలోకపు ప్రపంచముతో మరింత సమీపముగా ప్రవేశించుటకు, పరలోకపు సహవాసమును అనుభవించుటకు అవసరమైన శక్తిని, శాశ్వతమైన తెలివిని, జ్ఞానమును పొందుకుంటాము. ఎలెన్‌జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు, పుట 355.

**రోమా 12:1,2 చదువుడి. మన జీవితాలలో వ్యతిరేక లక్ష్యములు నెరవేరుటకు ఏ రెండు విధానాలు పనిచేస్తాయి? అయితే వాటిలో మంచి దానికొరకు ఏవిధముగా అవకాశమును ఇవ్వగలము?**

రోమా పత్రికలోని సంక్షిప్త సారాంశము కలిగిన అధ్యాయములో మన జీవితాలను తీర్చిదిద్దే ప్రయత్నము చేసే రెండు విరుద్ధ శక్తులు పనిచేయుచున్నట్లు అపొస్తలుడైన పౌలు మాట్లాడెను. ఒక ప్రక్క, మన చుట్టు ప్రక్కలున్న లోకము దానియొక్క వివిధ రకాల ప్రభావములు, దాని యొక్క ఉచ్చులోనికి మనలను లాగుట ద్వారా ఈ లోక ప్రభావమునకు అనుగుణ్యముగా మనలో మార్పు తీసుకొని వచ్చుటకు ప్రయత్నిస్తూ వెలుపల నుండి లోపలకు పనిచేసే విధముగా మన మీద ప్రభావము చూపుతుంది.

దీని ప్రభావమునకు వ్యతిరేకముగా పనిచేయుటకు, పరిశుద్ధాత్మ మనలను అంతరాత్మ నుండి వెలుపలకు కనబడే విధంగా మన జీవితాలను మార్చివేయుట ద్వారా ఒక గొంగళిపురుగు సీతాకోక చిలుకగా భౌతికరూపములో మార్పు చెందినట్లు, మనలోను పరిశుద్ధాత్మ పనిచేయును. అట్టి విధానము మనలో ఆరంభము కావాలంటే మన జీవితాలను దేవునికి సమర్పించుకొని మనలో ఆయన ప్రారంభించిన మంచి పనిని కొనసాగింపచేయమని ప్రార్థించవలసి యున్నాము (ఫిలిప్పి 1:6) చివరిగా మన చిత్తశుద్ధితో క్షణక్షణం ఆత్మలో నడిపించే విధముగా ఎన్నిక చేసుకొనవలెను.

## శుక్రవారం — నవంబరు 21

## అదనపు అధ్యయనం

"వేగులవారిలో కొందరు పాపపు తలంపులతో ఇచ్చిన నివేదికను, ఏ చిత్తశుద్ధితో కాలేబు వ్యతిరేకించెనో, అదే మనస్సుతో అతడు అతని సాక్ష్యమునకు (నివేదికకు) కట్టుబడి ఉన్నాడు. కానాను దేశములో దేవుడు తన ప్రజలను నివసింపచేసెదనని చేసిన ఆయన వాగ్దానమునందు కాలేబు విశ్వాసముంచి, పరిపూర్ణముగా దేవునిని వెంబడించుచున్నాడు. అరణ్యములో తన తోటి ఇశ్రాయేలీయులతో అన్ని బాధలను, సమస్యలను సహించియుండెను. కొన్ని సందర్భాలలో కొంతమంది నేరము చేయుట వలన సంప్రాప్తమైన శిక్షను, భారములను పంచుకొనెను గాని, ఎన్నడు అతడు దేవునిని నిందించలేదు. దేవుని యొక్క కృపను అతడు ఉన్నతమైనదిగా ఎంచెను. కొంతమంది తనతోటి ఇశ్రాయేలీయులు జాబితాలో నుండి వారి పాపముల వలన కొట్టివేయబడినప్పుడు, అతనిని దేవుడు అరణ్యములో కాపాడిన విధానమును బట్టి దేవునిని స్తుతించెను. ఎన్నో కష్టముల నడుమ, తెగుళ్ళ మధ్య అరణ్యములో సంచరించుచుండగా, కానాను దేశములో ప్రవేశించిన తరువాత, కానానీయులతోను ఇతర

జనులతోను జరిపిన యుద్ధములలో దేవుడు వారి ప్రాణములను కాపాడెను. ఇప్పుడు అతని వయస్సు 80 సంవత్సరాలైనా, అతనిలోఉన్న ఉత్సాహ శక్తి ఏమాత్రము తగ్గలేదు. జయించబడిన భూభాగాలలో తన కొరకు భూమిని అడుగలేదు కాని, మిగిలిన వేగులవారు, స్వాధీనపరచుకొనుట మనకు అసాధ్యమని తెల్పిన భూభాగములనే కాలేబు ఎంచుకొనెను. ఎంతో భారీ దేహములు గల ఆ ప్రజలనుండి తనకు దేవుడనుగ్రహిస్తానని చేసిన వాగ్దాన భూమిని తీసుకొని, దానిని స్వాధీనపరచుకొనగలనని, దేవుని సహాయమును కోరుకొనెను. ఆ ప్రజలను చూచి ఇశ్రాయేలీయులు వారి విశ్వాసమును ధైర్యమును కోల్పోయిరి. అయితే కాలేబు ధైర్యమైన ఒక వృద్ధ సైనికుడుగా తన ప్రజలకు మాదిరిగా నిలిచి దేవునికి మహిమ కలుగునట్లు తన ప్రజలను ప్రోత్సాహిస్తూ తనకు స్వాస్థ్యముగా ఇవ్వబడిన భూభాగమును జయించుట అసాధ్యమను కొనిన దానిని కాలేబు స్వతంత్రించుకొనెను" ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుట 512, 513.

"దేవునియందు తనకున్న విశ్వాసమును బట్టి కాలేబుకు ధైర్యము కలిగెను. అతడు మనుష్యునికి భయపడకుండా చేసినది కూడా దేవునియందున్న తన విశ్వాసమే. ఆ విశ్వాసమే అతనిని ధైర్యముగా నిలువబడగలిగేటట్లు చేసెను. పరలోక సైన్యములకు అధిపతియైన దేవునికి నమ్మకమైన, సిలువ సైనికుడుగా ఎదిరించ శక్యముగాని అవరోధాలను సహితము ఆయన ధైర్యముతో ఎదిరించి విజయశీలుడయ్యెను" –ఎలెన్ జి వైట్, ఎడ్వంటు రివ్యూ మరియు సబ్బాతు హెరాల్డు మే 301912.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. స్నేహితుల యొక్క ప్రభావము ఎటువంటి పనులను చేయుటకు నడిపిస్తుంది, అవి తప్పు అని చెప్పగలిగే ధైర్యము ఎందుకవసరము? మన విశ్వాసమును కాపాడుకొనుటకు ధైర్యము ఎంత వరకు అవసరము? మనము నమ్మినది సత్యమని తెలిసినప్పుడు అసభ్యకరముగా ఉండకుండునట్లు ఏవిధంగా తప్పించుకొనగలము?
2. నీ జీవితమును, ప్రవర్తనను మార్చి వేసిన నీ విశ్వాసమునకు సంబంధించిన ఉదాహరణలను మీ ప్రాంతీయ సంఘములో పంచుకొనుడి. కొందరిని అనుకరించాలనుకున్నపుడు వారి గుణగణములు ఏరీతిగా ఉండాలని కోరుకుంటాము?
3. మన జీవితము మీద ప్రసార మాధ్యమముల యొక్క ప్రభావమును గూర్చి మీ తరగతిలో చర్చించండి. మంచి లక్ష్యముల కొరకు పత్రికా మాద్యమములు పని చేసినచో వాటిని ప్రోత్సహిస్తూ, వ్యతిరేక మాద్యములను ఎట్లు మనము తప్పించవలెను?
4. యెహోషువ నాయకుడుగా చూపిన వినయమును గూర్చి, దేవుని మందిరమునకు సమీపముగా జీవించాలనే అతని కోరికను గూర్చి చర్చించండి. ఏ రీతులలో అతని మాదిరి మనతో మాట్లాడుచున్నది?

❋✶❋